నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల
వనపర్తి
3 | మహబూబ్‌నగర్, గురువారం 15 ఫిబ్రవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY


గువ్వలదిన్నెలో మైసమ్మకు పూజలు చేస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## మైసమ్మ ఆశీస్సులు ఉండాలి

- గ్రామదేవతకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పూజలు

కేటీదొడ్డి, ఫిబ్రవరి 14 : మండలంలోని గువ్వలదిన్నెలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత మైసమ్మ అవ్వను బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎలప్పుడూ ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ రాజశేఖర్, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, చక్రధర్‌రావు, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గిరిజన సేవా సమితి జిల్లా నూతన కమిటీని అభినందిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

## నిస్వార్థంగా సేవలందించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 14 : సమాజంలోని వ్యవస్థలలో పని చేస్తున్నప్పుడు నిస్వార్థంగా సేవలందిస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మాజీ మంత్రి తన నివాసంలో నూతనంగా ఎన్నికైన జిల్లా గిరిజన సేవా సమితి నాయకులను శాలువా కప్పి అభినందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సేవ చేయడానికి అందరికీ అవకాశం రాదని, వచ్చిన వారు తప్పక సమయం కేటాయించి సేవలందిస్తే తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. చేసే పనిలో వివాద రహితులుగా గుర్తింపు తెచ్చుకోవాలని వారికి సూచించారు. అనంతరం జిల్లా గిరిజన సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ముడావత్ చంద్రూనాయక్, కమిటీ సభ్యులు నారాయణనాయక్, జహంగీర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు కృష్ణానాయక్‌ను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఖిల్లాఘణపురం ఎంపీపీ కృష్ణానాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, హనుమంతునాయక్, శ్రీధర్‌నాయక్, అర్జున్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


బీచుపల్లి లక్ష్మీ హయగ్రీవ సమేత జ్ఞానసరస్వతీ ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకులు

## సరస్వతీ.. అనుగ్రహించు తల్లీ

- బీచుపల్లి ఆలయంలో 200 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం

ఇటిక్యాల, ఫిబ్రవరి 14 : చదువుల తల్లి సరస్వతీదేవి పుట్టిన రోజును పురస్కరించుకొని బీచుపల్లి క్షేత్రంలోని లక్ష్మీహయగ్రీవ సమేత జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, విశేష అలంకరణను ఆలయ అర్చకులు భువనచంద్ర, దినకరాచార్యులు, దత్తు, భానుమూర్తి నిర్వహించారు. అనంతరం దాదాపు 200మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అయ్యపురెడ్డి భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బందితో పాటు భక్తులు పాల్గొన్నారు.


కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్‌లో మూడ్రోజుల కిందట వేరుశనగ కుప్పల వద్దే నిద్రిస్తున్న రైతులు


అచ్చంపేటలో మూడోసారి రోడ్డెక్కిన రైతన్న

జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తిన వేరుశనగ

### రోజుల తరబడి పడిగాపులు..

మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో రైతులు పండించిన వేరుశనగకు మంచి డిమాండ్ ఉంది. గతేడాది అత్యధిక ధరకు వేరుశనగ విక్రయించడంతో రైతులు లాభాల బాట పట్టారు. ఈసారి కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అధికారులు అంచనా ప్రకారం 2 వేల మెట్రిక్ టన్నుల వేరుశనగ పండింది. కొంత మంది రైతులు ప్రైవేట్ గానుగ మిల్లులకు వేరుశనగను సప్లై చేశారు. మిగతా రైతులంతా మార్కెట్లకు తరలించి అమ్ముకుందామని ప్రయత్నిస్తున్నా వ్యాపారులెవరూ కొనుగోలు చేయడానికి ముందుకురావడం లేదు. దీంతో రైతులు రోజుల తరబడి వేరుశనగను మార్కెట్లలో కుప్పలు కుప్పలుగా పోసుకొని వాటి చుట్టూ కాపలాకాస్తున్నారు. మార్కెట్లలో పందులు వేరుశనగను తినకుండా కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. తీరా వేరుశనగ తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో అసహనం పెరుగుతున్నది. దీంతో అన్నదాతలు అక్కడక్కడా అధికారులపై తిరగబడుతున్నారు.

# దళారుల దగా!

## రైతులు విలవిల.. వ్యాపారులకు కాసులు గలగల

- ఉమ్మడి జిల్లాలో కర్షకులకు కుచ్చుటోపీ
- మార్కెట్లలో తక్కువ ధరకే పల్లి కోట్
- అధికారులతో వ్యాపారుల కుమ్మక్కు
- మద్దతు ధర సైతం రాకుండా కుట్ర
- వారి చెప్పిన ధరే ఫైనల్
- రోడ్డెక్కుతున్న వేరుశనగ రైతులు
- మార్కెట్ అధికారులు, వ్యాపారులపై తిరుగుబాటు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరుగాలం కష్టపడి పండించిన వేరుశనగకు మద్దతు ధర రాకపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో వేరుశనగకు మంచి రేటు ఉన్నప్పటికీ వ్యాపారులు, మార్కెట్ అధికారులు కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేసేందుకు యత్నిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మార్కెట్లకు వందలాది క్వింటాళ్ల వేరుశనగ పోటెత్తుతున్నా.. కమీషన్ ఏజెంట్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు మార్కెట్లలోనే రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. వంటావార్పు కూడా మార్కెట్లోనే చేసుకుంటూ వేరుశనగ కొంటారని ఆశతో ఎదురుచూస్తున్నారు. కానీ వ్యాపారులు, దళారులు కుమ్మక్కై తక్కువ ధరకు టెండర్లు వేసి రైతులను నిలువునా ముంచేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఈ విషయం తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి వేరుశనగ కొనుగోలు చేయకపోవడంతో రైతుల్లో అసహనం పెరిగి ఏకంగా అచ్చంపేట మార్కెట్ యార్డు కార్యాలయంపై దాడికి ప్రయత్నించారు. కల్వకుర్తిలోనూ రాస్తారోకోకు దిగారు. మహబూబ్‌నగర్‌లో కూడా రైతులు మార్కెట్ యార్డు ఎదుట ఆందోళనకు దిగారు. వనపర్తితోపాటు మిగతా మార్కెట్లలో కూడా వేరుశనగ కుప్పలు తెప్పలుగా అలాగే పడి ఉన్నాయి. ఎప్పుడు కొంటారా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ.. ఇటు ప్రభుత్వం కానీ అటు అధికారులు కానీ పట్టించుకోకపోవడంతో రైతుల కష్టం దళారుల పాలవుతున్నది.


అచ్చంపేట ప్రధాన రహదారిపై వారం కిందట వేరుశనగ కుప్పకు నిప్పంటించి ఆందోళన చేస్తున్న రైతులు

### మద్దతు ధర కన్నా రూ.3వేలు తక్కువకు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నెలరోజుల నుంచి ఆయా జిల్లాలోని మార్కెట్లకు రైతులు వేరుశనగ అమ్మడానికి తీసుకొస్తున్నారు. బహిరంగ మార్కెట్లో క్వింటా వేరుశనగకు రూ.8 వేలు ధర ఉన్నప్పటికీ.. మార్కెట్లలో గరిష్ఠ ధర రూ.7,187గా ఉన్నది. కాగా, ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. రైతులు ఎలాగోలా తమకే అమ్ముతారని ధీమాతో వ్యాపారులు కుమ్మక్కై గరిష్ఠ ధరకు రూ.3వేలు తక్కువకే టెండర్ కోట్ చేస్తున్నారు. దీనికి మార్కెట్ అధికారులు కూడా వంత పాడుతున్నారు. నామమాత్రంగా వ్యాపారస్తులు గరిష్ఠ ధరకు ఐదు పది క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసి మిగతా వేరుశనగను నాణ్యతలేదనే పేరుతో రిజెక్ట్ చేస్తున్నారు. రైతులకు మద్దతు ధర ఇప్పించాల్సిన మార్కెట్ అధికారులు వ్యాపారస్తులతో కుమ్మక్కు కావడం రైతుల ఆగ్రహానికి కారణమవుతున్నది. ఈ కారణంగానే అచ్చంపేట మార్కెట్ యార్డుపై రైతులు దాడికి తెగబడ్డారు. వేరుశనగను మార్కెట్‌కు తీసుకొచ్చి రోజులు గడుసున్నా పట్టించుకోకపోవడంతో ఆగ్రహం చెందిన రైతులు ఏకంగా మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడికి దిగారు. మార్కెట్ చైర్మన్ మహిళా అని కూడా చూడకుండా ఆమెను బయటకులాగి దాడి చేసినంత పని చేశారు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది.

### పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు..

సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో వేరుశనగ రైతులు రోడ్డు ఎక్కుతున్నా ఇటు అధికార యంత్రాంగం.. అటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. పదిహేనురోజుల నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుశనగను కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ ఉలుకూపలుకూ లేదు. కలెక్టర్లు కూడా ఆయా మార్కెట్లను తనిఖీ చేయకుండా వ్యాపారస్తులకు మద్దతు తెలుపుతున్నారు. దీంతో రెచ్చిపోయిన వ్యాపారస్తులు మార్కెట్ అధికారులతో కుమ్మక్కై వేరుశనగకు తక్కువ ధర టెండర్లు వేసి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. మార్కెట్లో వేరుశనగ కొనుగోలు పూర్తిగా మందగించడంతో రైతులు వచ్చిన ధరకే అమ్ముకొని నష్టపోతున్నారు. మరికొంతమంది రైతులు కడుపు మంటతో ఆందోళనకు దిగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు సరైన మద్దతు ధర కల్పించి మార్కెట్లకు వచ్చిన వేరుశనగను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## నిజరూప దర్శనం.. సర్వ పాపహరణం

- జగజ్జననీ పాహిమాం అంటూ జోగుళాంబను వేడుకున్న భక్తులు
- నయనానందకరం.. గ్రామోత్సవం
- అలంపూర్‌లో ముగిసిన ఉత్సవాలు

అలంపూర్, ఫిబ్రవరి 14 : ఐదో శక్తిపీఠమైన అలంపూర్ క్షేత్రంలో ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా జరిగిన బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చి ఉభయ ఆలయాల్లో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎలాంటి అలంకరణ లేకుండా జోగుళాంబ దేవి నిజరూపంలో భక్తులు దర్శనమిచ్చింది. అమ్మల గన్న అమ్మ.. జగజ్జననీ పాహిమాం.. పాహిమాం.. మమ్మల్ని చల్లంగా చూడమ్మా అంటూ వేడుకున్నారు. కొందరు పూనకాలతో ఊగిపోయారు. 1108 కలశాలతో అభిషేకాలు, పూజలు జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన గ్రామోత్సవం అలరించింది. జోగుళాంబ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఆనంద్ శర్మ, ఉపాధ్యక్షుడు బండారు బాబు, గౌరవ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ సొంత ఖర్చుతో ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు ప్రాంతం నుంచి కళాకారులను తీసుకొచ్చారు. గ్రామ దేవతల వేషధారణలో నిర్వహించిన ఊరేగింపు అలరించింది. తుంగభద్ర నదీ తీరంలోని హరిశ్చంద్ర ఘాట్‌లో వెలిసిన ఘంటలేశ్వరాలయం నుంచి ఊరేగింపు మొదలై జోగుళాంబ ఆలయం వరకు చేరుకున్నది. అలాగే జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే విజయుడు పాల్గొని పూజలు చేశారు.


గ్రామోత్సవంలో కళాకారుల ప్రదర్శన


నిజరూప దర్శనమిస్తున్న అమ్మ వారు

### జీవో నెం. 46 బాధితుల కట్టడి

- కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది
- బాధిత పోలీసు అభ్యర్థుల ఆరోపణ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జీవో నెంబర్ 46ను ఎత్తివేసి పోలీసు నియామకాల్లో ఎన్నికైన అభ్యర్థులకు న్యాయం చేస్తామని నమ్మించి తమను ఎన్నికల్లో వాడుకొని ఇప్పుడు పట్టించుకోకుండా అన్యాయంగా పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తున్నారని పలువురు పోలీసు అభ్యర్థులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన 15వేల రాష్ట్ర పోలీసు ఉద్యోగాల్లో ఎంపికైన అభ్యర్థులకు గురువారం హైదరాబాద్‌లో జీవో నెంబర్ 46 నిబంధనల ప్రకారం నియామక పత్రాలు అందజేయడంతో పోలీసు అభ్యర్థులు జిల్లాలో ఆందోళన నిర్వహించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ముందే ఈ అభ్యర్థులను హైదరాబాద్ రానీయకుండా కట్టడి చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించడంతో పోలీసులు పలుచోట్ల అభ్యర్థులను పోలీస్‌స్టేషన్‌లో ఉంచి వారిని హైదరాబాద్ వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు జీవో నెంబర్ 46 విరుద్ధంగా ఉందని, ఆ జీవోను రద్దు చేసి తమకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నచ్చజెప్పి తమతో బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయమని చెప్పిన రేవంత్‌రెడ్డిపై అసహనాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేసి గెలిపిస్తే తమకు తీవ్ర అన్యాయం చేశారని వారు మండిపడ్డారు.

## విద్యుదాఘాతంతో యువతి మృతి

- పండుగపూట పలుగుతండాలో విషాదం

మహ్మదాబాద్, ఫిబ్రవరి 14 : పండుగ కోసం అక్క వాళ్ల ఇంటికి వచ్చి విద్యుదాఘాతానికి గురై ఓ యువతి మృతి చెందిన ఘటన గండీడ్ మండలంలోని పలుగుతండాలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. మద్దూరు మండలం కొత్తపల్లితండాకు చెందిన బెనిక్యానాయక్ తన కుటుంబసభ్యులతో కలిసి గండీడ్ మండలం పలుగుతండాలో పెద్దకూతురు సోనీబాయి ఇంట్లో తుల్జాభవానీ పూజకు వచ్చారు.

అందరూ సంతోషంగా పండుగ జరుపుకొంటుండగా సోనీబాయి చెల్లెలు పూజ (18) మంగళవారం రాత్రి 11:30 గంటలకు ఇంట్లో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్‌ను తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే యువతిని మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి బెనిక్యానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మహ్మదాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి వెల్లడించారు.

## అమ్మా.. చల్లంగా చూడు

- ఘనంగా బండారు ఉత్సవాలు

మరికల్, ఫిబ్రవరి 14 : మరికల్‌లో ప్రతి ఐదేండ్లకు ఒకసారి నిర్వహించే ఎల్లమ్మ బండారు ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కురుమయాదవుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించి అమ్మా ఎల్లమ్మా.. చల్లంగా చూడమ్మా అని వేడుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ముందుగా బైండ్లవారు ఎల్లమ్మను ఊరేగించిన అనంతరం పాఠశాల ఆవరణలో ముగ్గులతో పట్నం వేసి ఎల్లమ్మకు నైవేద్యంగా కల్లును ఉంచి తమ పాటలతో పట్నం ముందు మేక పిల్లను నిద్రపుచ్చి ఎల్లమ్మ కథను చెప్పారు. అనంతరం మేకను నిద్ర లేపి ఎల్లమ్మకు బలిఇచ్చి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడీ, జబ్బనోళ్ల వంశస్తులు ఒకరిపై ఒకరు పసుపును చల్లుకున్నారు. సోమవారం ఇదే వంశస్తులు బీరప్ప ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో కురుమలతోపాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


బండారు ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

శ్రీ అయ్యప్ప న్యాచురల్ ఆయిల్ కట్టె గానుగ నూనెలు
SBI పద్మావతి కాలనీ బ్రాంచ్ ఎదురుగా, మహబూబ్‌నగర్. సెల్ : 9700618560
మా వద్ద పల్లినూనె, కొబ్బరి నూనె (బురిడి) నువ్వుల నూనె, సన్‌ఫ్లవర్ కుసుమ నూనె, ఆముదం నూనెలు లభించును



WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified 4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry Please Contact...
9182777641
9182777654
9182777794